జడ్ - 6

సుజనశ్రీ

నిరంజనరావు తన ఆఫీసురూమ్‌లో కూర్చుని స్టెనోకి ఏవేవో బిజినెస్ లెటర్స్‌కి రిప్లైలు డిక్టేట్ చేస్తున్నాడు. మధ్య మధ్యలో పైప్ నోట్లో పెట్టుకుని గట్టిగా ఒక దమ్ములాగి మళ్ళీ పక్కన పెట్టేసి డిక్టేట్ చేస్తున్నాడు.

నిరంజనరావు వయసు అరవై సంవత్సరా లుంటయ్. అతడు "నిరంజన్ కిమికల్స్" అనే కంపెనీకి ప్రొప్రయిటరు.

స్వాతంత్ర్యం రాకముందే అతడు ఈ కంపెనీని పెట్టి ఉన్నాడు. స్వతహాగా అతడికి ఆస్తి ఏమీ లేదు మొదట్లో. ఆస్తికోసం కొంచెం అనాకారి అయిన భాగ్యవంతుల అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడు. తనకిచ్చిన కట్నం డబ్బుతో ఈ కిమికల్ కంపెనీని మొదలెట్టాడు, మరో కెమిస్ట్‌ని పార్ట

నర్ గా కలుపుకుని.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి పొందటం, ప్రతి రసాయనిక ఫ్యాక్టరీకి, ఇతర అనేక రకాల మందుల ఉత్పత్తిలోనూ నిరంజనరావు తయారుచేయిస్తూన్న కెమికల్స్ అవసరం అవటంవల్ల అతి త్వరలోనే ఆ కంపెనీ పెరిగిపెరిగి పెద్దదయిపోయింది.

నిరంజనరావు చూస్తుండగానే లక్షాధికారి అయిపోయాడు.

స్టెనో డిక్టేషన్ పూర్తిచేసుకుని వెళ్ళిపోయింది.

టేబుల్ మీద మరో గంటలో గవర్నమెంటుకి చేరవలసిన టెండరుమీద సంతకం పెడుతూండగా ఫోను మ్రోగింది. రిసీవర్ ఎత్తి చెవిదగ్గర పెట్టుకుని "హలో! నిరంజనరావు స్పీకింగ్" అన్నాడు.

"ఒరే! నిరంజనా? నువ్వేనా మాట్లాడేది! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు కలుసుకున్నాం? నేను రామ్మూర్తిని మాట్లాడుతున్నాను."

"హలో! ఎప్పుడురా రావటం! ఎక్కడుంటున్నావు? ఏంచేస్తున్నావ్! అయినా ఇదేమిటోయ్ ఫోన్‌లో పరామర్శ వెంటనే మా ఆఫీసుకురా! ఇద్దరం ఇంటికి వెళ్దాం."

"ఓ! అలాగే. నిన్ను చూసికూడ చాలా రోజులయింది. నువ్వు ఉంటావో ఉండవో ఫోన్ చేసి కనుక్కుందాం అని చేశాన్లే. మీ ఆవిడ ఆరోగ్యం ఎలా ఉంటోంది?"

"అరే ఫూల్! ఇంకా ఫోన్‌లోనే ఉన్నావ్. ఫోన్ పెట్టేసెయ్. త్వరగా వచ్చెయ్! నీకోసమే వెయిట్ చేస్తుంటాను" అంటూ రిసీవర్ క్రేడిల్ మీద పెట్టేశాడు నిరంజనరావు.

2

రామ్మూర్తి, నిరంజనరావు బాల్యస్నేహితులు.

రామ్మూర్తి ప్రభుత్వగిరీ వెలగబెట్టి ఇటీవలే రిటైరయి పోయాడు. అతడికి నాటకాల పిచ్చి జాస్తి. కాలేజీలో చదివే రోజుల్లోనే స్టేజీయాక్టర్ గా పేరు పొందాడు. దుర్యోధనుడి పాత్ర దగ్గరునుంచి ఎన్. జి. ఓ. వేషం వరకూ వేసి నటించ గలడు.

నిరంజనరావు, రామ్మూర్తిని ఆప్యాయంగా పరామర్శిం చాడు. కుటుంబ వ్యవహారాల గురించి తెలుసుకున్న తర్వాత డ్రింక్ ఆఫర్ చేశాడు.

"హాట్ డ్రింకా? లేక కూల్ డ్రింకేనా?" అని అడిగాడు నిరంజనరావు నవ్వుతూ.

"మాబోటి పేదలకు కాఫీ తాగే స్తోమతు ఉండదు. ఇంకా హాట్ డ్రింక్స్ బ్రాందీ, విస్కీ ఎలా తాగగలం?"

"చాల్లేరా నీ బీద అరుపులు. గవర్నమెంటు సర్వీసులో బల్లక్రిందనుంచి ఏమాత్రం లాగావో నాకు తెలీదనుకోకు!"

"నీవు ఒక నెలలో సంపాదించినంత లాభంలో అది ఎన్నో వంతంటావు? ఎలాగైనా అదృష్టమంటే నీదే. అన్నట్టు నీ పుత్రరత్నం ఏడీ? వాడ్నిగూడ బిజినెస్‌లోకి దించలేక పోయావా?"

నిరంజనరావు సైగచేసేసరికి రెండు కప్పుల్లో బోర్నవిటా వచ్చింది.

"ప్రస్తుతం నా విచారమంతా వాడ్ని గురించేనయ్యా?" అతని ముఖంలో మెదిలిన విచార రేఖలకు రామ్మూర్తిగూడ జాలిపడ్డాడు.

"అసలు మీ కుర్రాడికి ఇంటరెస్ట్ లేదా నీ బిజినెస్‌లో?"

"అదేమో తెలీదు. చూట్టానికి మనిషి బాగానే ఉంటాడు. వ్యాపారం చూసుకోరా అంటే నాకు చిరాకు అంటాడు. వాడు స్వతహాగా కొంచెం నెమ్మదస్తుడు."

"పండిత పుత్రుడన్నమాట. నీ వ్యాపార దక్షత వాడి

కబ్బలేదంటావ్?"

"పుట్టడంతోనే ఎవరూ తెలివిగా ఉండకపోవచ్చు. కాని నిదానంగా వ్యాపారంలోని కిటుకులు నేర్చుకుంటువుగాని రారా అంటే ససేమిరా వినడు. వాడ్ని వెనకేసుకు వస్తుంది వాళ్ళమ్మ. ఆమె కళ్ళకు వీడు ఇంకా పిల్లవాడిలాగే కనబడతాడు."

"అది సహజమేలే. ఇంతకీ మీవాడు ఏం చదివాడు?"

"బి. కాం. ప్యాసయ్యాడు. ఆపైన చదవనని మొండికేశాడు."

"అతగాడి హాబీలు ఏమిటి?"

"ఏముంది? నెంబర్ వన్. సినిమాలు చూడడం. ప్రతి సినిమాకు రిలీజ్ అయినరోజే వెళ్ళటం."

"అది పెద్ద నేరం కాదు. ఈ రోజుల్లో ముసలమ్మలు గూడా సినిమా పేరు చెబితే పరుగెత్తుతున్నారు, ఎండనకా, వాననకా."

"రెండోది డిటెక్టివ్ పుస్తకాలు చదవటం. మార్కెట్లోకి వచ్చిన పుస్తకం ముందు వీడిచేతిలో పడాల్సిందే. కొన్నికొన్ని పుస్తకాలు ప్రింటర్స్ దగ్గర్నుంచే తెప్పించుకుంటాడు గూడా మార్కెట్లోకి రిలీజ్ కాకముందే."

"ఓస్! ఇంతేనా? అవి చదవని వాళ్ళెవరు యీ రోజుల్లో. వాటిలో ఉండే 'థ్రిల్' నీకేం తెలుస్తుందిలే! ఆఁ ఇంకా చెప్పు'" అన్నాడు రామ్మూర్తి భావగర్భితంగా నవ్వుతూ.

"ఏముంది? అమ్మాయిలతో షికార్లు! వసంతవిహార్ హోటల్లో ఒకరూమ్ నెలసరి బాడుగకు తీసుకున్నాడు. వాడి మకాం ఎక్కువసేపు అక్కడే."

రామ్మూర్తి కొన్ని క్షణాలు ఆలోచనలలో పడిపోయాడు.

"నా ఉద్దేశ్యంలో మీవాడు దారికి రావాలంటే ఒకేఒక ఉపాయంవుంది. అయితే అందుకు కొంత ఖర్చవుతుందిమరి?"

"నా దగ్గరకూడా బల్లక్రింద చేయిచాపే ఉద్దేశ్యం పోగొట్టుకున్నావుకాదు. యూ సిల్లీ కోంగ్!" అని నవ్వాడు నిరంజనరావు.

"ఛాఛా! అదేంకాదు. నీమేలు కోరేవాడ్ని గనుక చెబుతున్నాను. అంతే!"

"సీరియస్‌గా తీసుకోకు నేనన్నది. జోక్‌గా అన్నానులే. అయితే మావాడ్ని దారికి తీసుకువస్తానంటావ్?"

"తప్పకుండా. ఓ రెండువేలు మాత్రం ఖర్చవుతుంది! ఒకవారం పదిరోజుల్లో మీవాడు ఆఫీసు వెతుక్కుంటూ వచ్చి నీ కుర్చీలో కూర్చోకపోతే నాపేరు రామ్మూర్తికాదు."

"అంతమాట ఎందుకులేరా! చిన్నప్పుడుగూడా నాకు మంచి విలువైన సలహాలు ఇచ్చేవాడివిగదా! ఇదుగో రెండువేలు తీసుకో! మావాడి భారం నీమీద పెడుతున్నాను. ఇక ఇంటికిపోదాంపద! మాంచి విందు మనకోసం ఎదురుచూస్తుంటుంది" అంటూ లేచాడు నిరంజనరావు.

3

"జెండాపై కపిరాజు" అంటూ గొంతెత్తి పద్యం అందుకున్నాడు కాళిదాసు.

"అదీ వరస. నా సామిరంగా!" అంటూ హార్మోని తొక్కుతున్నాడు చలమయ్య తల ఊగిస్తూ.

"జెండాపై కాదురా. మన కడుపులో కపిరాజు ఎగురుతున్నాడు. తెల్లవారి తొమ్మిదయింది. ఇంతవరకు నోట్లో కాసిని కాఫీనీళ్లు జారలేదు. మీలో ఎవడి దగ్గరా కాఫీ డబ్బులుగూడా లేవట్రా?"

అరిచాడు ఒకమూల మూడుకాళ్ళ కుర్చీలో ఒరిగిపోయిన చంద్రరావు.

"ఒరే సన్నాసి, జేబులో కాఫీడబ్బులే వుంటే ఇక్కడ

ఇంతసేపు ఇలా రాగాలు తీస్తూ వుంటాముట్రా?" రాగ యుక్తంగా సమాధానం చెప్పాడు కాళిదాసు.

"మరయితే ఆ రాగాలు కాసేపు ఆపి ఏడవకూడదూ?"

"రాగం విని అయినా ఎవరన్నా మెచ్చుకుని గొంతు తడుపుతారని పాడుతున్నాం. అయినా మన నాటక సంఘంలో హీరోయిన్ సావిత్రిని ఎదురుగా వుంచుకుని మమ్మల్ని దేబిరిస్తావేంరా?" అన్నాడు చంద్రారావు.

"సరేలే! ఇంతమంది మగమహారాజుల దగ్గరలేంది నా దగ్గరమాత్రం ఎలా వుంటయ్. నా టెరిలిన్ చీరలు డ్రై వాషింగ్ కివేశాను... తెచ్చుకోవటానికి డబ్బులేక ఉదయం నుంచి ఇక్కడ పడిగాపులు గాస్తున్నాను" సావిత్రి సమాధానం.

"కటకటా! నేటి కలికాలపు సావిత్రి కన్ని కష్టములు వాటిల్లెన్! అలనాడు యముడ్ని జయించిన సావిత్రిగూడ ఈనాటి కష్టాల్ని చూసి ఝడుసుకుని పారిపోవలసినదే!" చమత్కరించాడు కాళిదాసు.

"ఒరేయ్! రాముడూ! ఆ నాయర్ టీ స్టాల్లోనన్నా టీ అనబడే ఆ కాషాయాన్ని పట్టుకురారా!" అన్నాడు చంద్రారావు.

"అబ్బే! అదీ ట్రైచేసి చూశాం. పాత బాకీ అంతా కట్టేసేగాని అరువు ఇవ్వనన్నాడుసార్!" కర్టెన్ బోయ్ సమాధాన మిచ్చాడు.

"పోనీ సిగరెట్లకొట్టువాడన్నా అరువు ఇస్తున్నాడా?"

"వాడిదగ్గర మన పరువు ఇంకా పోలేదుసార్!"

"అలా అయితే అక్కడికివెళ్ళి రెండుగోల్డ్ ఫ్లేక్ సిగరెట్ ప్యాకెట్లు తీసుకో. మలుపులో బడ్డీకొట్లో ఒక పావలాతగ్గించి అమ్మి ఆ డబ్బుతో కాఫీలు పట్రా! ఇంకా ఏమీ సమాధానం చెప్పమాకు. ఫో ముందు!" అన్నాడు చంద్రారావు.

"ఒరేయ్! మార్విలస్ రా నీ బుర్ర! ఇప్పుడే నీ తల తెగ నరికి మ్యూజియంకి అమ్మేయాల్సిందే!"

"అపరా నీ బోడి కాంప్లిమెంట్! ఇక్కడ ఎందరం వున్నాం? ఆఁ అయిదు కాఫీలు ఒక బోర్న్‌విటా పట్రా!"

"నాకు కిళ్లీ కూడా పట్టుకురా రాముడూ!"

కుర్రబోయ్ రాముడు పరుగెత్తు కెళ్ళిపోయాడు. అందరూ పరీక్షా ఫలితాలకోసం ఎదురుచూచే విద్యార్థుల్లా ఆత్రతగా ఎదురుచూశారు.

పావుగంట గడిచాకా రాముడు కాఫీలు పుచ్చుకుని ప్రత్యక్షమయ్యాడు. వాడిచుట్టూ మూగి తలా ఒక కాఫీ గ్లాసు అందుకుని వేడివేడి కాఫీని గటగట త్రాగేశారు.

"అమ్మయ్య! ఇప్పటికి ప్రాణం తేరుకుంది" అన్నాడు కాళిదాసు.

"రాముడూ! కిళ్లీ పట్రాలేదురా?" అంది సావిత్రి.

"ఇదుగోనమ్మా!" అంటూ కిళ్లీ తీసి సావిత్రికి అందించాడు రాముడు.

వాకిట్లో రిక్షా ఆగిన అలికిడివిని అందరూ అటు చూశారు. రిక్షాలోంచి ఒక లావుపాటి వ్యక్తి దిగాడు. నీరుకావి పంచె, తెల్లటి చొక్కామీద పాతకాలంనాటి కోటు, నడుముకు బెల్టు, చత్వారం కళ్ళజోడు, చంకలో గొడుగుతో దిగుతున్న ఈ వ్యక్తి ఎవరా అని కాళిదాసు ఎగాదిగా చూశాడు.

"చంద్రయ్యా లేడా ఇక్కడ?" గుబురు మీసాల్ని మెలిబెట్టుకుంటూ అడిగాడు అతను.

చంద్రరావు అప్పటికిగానీ గుర్తుపట్టలేదు ఆ వ్యక్తిని. తమ నాటక సమాజంలో ఒకసారి దుర్యోధన పాత్ర వేసిన యన్. జి. వో. ఇతగాడు అనుకున్నాడు.

"మీరా సార్! ఎవరా అని చూస్తున్నాను ఇందాక

ట్నుంచి! రండిసార్! కూర్చోండి!" అంటూ చంద్రారావు కుర్చీ చూపించాడు.

అతను కుర్చీలో కూర్చున్నాడు.

"ఊరక రారు మహానుభావులు. ఏదో పనిమీద వచ్చి వుంటారు!" చంద్రారావు వినయంగా అడిగాడు.

"అవును చంద్రారావ్! మీ నాటకసమాజంచేత ఒక నాటకం వేయించాలని వచ్చాను."

"మహాద్భాగ్యం! చాలా సంతోషం! ఏ ఊళ్లో వేయాలండీ! సాంఘికమా? పౌరాణికమా?"

"అలా ఆతృత పడకండి. నేను చెప్పేది సావధానంగా వినండి! నేను చెప్పిన నాటకం ఆడడానికి మీకు పారితోషికం వెయ్యిరూపాయలు. అందులో ఎడ్వాన్సుగా అయిదువందలు ఇప్పుడే ఇచ్చేస్తాను" అని ఆగి అందరికేసి చూశాడు.

అందరూ గుటకలు మింగుతున్నారు. నాటకానికి యాభై వందా కన్నా ఎక్కువరాని ఈ రోజుల్లో ఆ మొత్తం వినేసరికి వాళ్లు మహదానందం పడిపోతూ, ఆ గుబురు మీసాలాయన చెప్పేది చెవులు రిక్కించి వినసాగారు.

4

"నీ పేరేమిటన్నావ్?" అన్నాడు వాసుదేవరావు ఆమె జుట్టు సవరిస్తూ.

ఆమె కిలకిల నవ్వింది.

"పేరేమయితేనేం? మనిషిని నచ్చానా?"

"నీకేం! రంభలా వున్నావ్! అంత అందమయిన దాని పేరుగూడా అందంగా వుంటుందనే అడిగాను."

"అబ్బో! ఇందాకట్నుంచి మౌనంగా ఊరుకుంటే ఏమో అనుకున్నాను. మంచి మాటకారులే!" అంది ఆమె.

"ఇంతకీ నీ పేరు చెప్పనేలేదు!"

"నా పేరు సుందరి. చాలా?"

నవ్వుతూన్న ఆమె నోటిని మూయాలని అతడు తన పెదాలను దగ్గరకు చేర్చాడు.

ఎదుటి స్టూలుమీద టెలిఫోన్ మ్రోగింది. విసుక్కుంటూ లేచాడు వాసుదేవరావు. లుంగీ మొలకు చుట్టుకుని టెలిఫోన్ దగ్గరకు నడిచాడు. నగ్నంగా పడుకునివున్న సుందరి దుప్పటి లాగి కప్పుకుంది గొంతువరకూ.

"హాలో! ఎవరూ మాట్లాడుతూంట! నేను నిరంజనరావుని మాట్లాడుతూంట! వాసు ఉన్నాడా?" పలికింది అవతలి కంఠం.

ఈ ముసలాడి కెప్పుడూ పనిపాటూ లేదు అని గొణుక్కుంటూ "నేనే డాడీ! ఏమిటి సంగతి?" అన్నాడు.

"నీకోసం అరగంటనుంచి పదిచోట్లకు ఫోన్ చేశాను. నీకేమో తమాషాగా వుంటుంది!" విసుక్కున్నాడు అవతలి నుండి నిరంజనరావు.

"అదిసరే! ఇంతకీ దేనికి పిలిచినట్టు?"

"సెంట్రల్ ఇంటలిజెన్స్ నుంచి ఎవరో సి. ఐ. డి. వచ్చాడు నీకోసం. ఇన్‌కమ్ టాక్స్ రెయిడ్ కాదులే! నీతోనే పర్సనల్‌గా మాట్లాడాలన్నాడు. నీ హోటల అడ్రసు ఇచ్చాను. మరో అరగంటలో నీ రూమ్‌కి రావచ్చు. ఆ విషయం చెప్పటానికే పిలిచాను. ఉంటాను మరి!" అంటూ ఫోన్ పెట్టేశాడు.

వాసుదేవరావుకు ముచ్చెమటలు పోసినయ్. రిసీవరు క్రేడిల్ మీద పెట్టేసి బెడ్ మీద చివరగా కూర్చుని విల్స్ సిగరెట్ వెలిగించాడు.

"ఊ క్విక్! త్వరగా! ఇక్కడ్నుంచి వెంటనే వెళ్ళిపో! పోలీసులు వస్తున్నారట! మా డాడీ ఫోన్ చేసి చెప్పాడు?" అన్నాడు ఆత్రుతగా.

పోలీసనే మాట వినేసరికి ఆమె హడావిడిగా లేచింది. గబగబ గుడ్డలు చుట్టుకుని బయటకు పరిగెత్తింది.

వాసుదేవరావు సిగరెట్ యాష్ట్రేలో పడేసి లేచి బెడ్ ని సరిచేశాడు. నలిగిపోయి రాలిన పూలను ఎత్తి అవతల పారేశాడు. లుంగీ విప్పి తన డ్రెస్ వేసుకున్నాడు. కప్ బోర్డులోంచి బ్రాందీ బాటిల్, ఖాళీగ్లాసులు, టీపాయ్ మీద పెట్టాడు. తనను కలుసుకోబోతున్న ఆగంతకుడికోసం ఎదురు చూడసాగాడు.

సి. ఐ. డి! తనను కలుసుకోవడానికి వస్తున్నాడు. ఏం పని అయ్యుంటుందబ్బా! తను చదివిన డిటెక్టివ్ నవలల్లోని పాత్రలాగ హుందాగా ఉండి ఉంటాడు అనుకున్నాడు వాసుదేవరావు.

కాలింగ్ బెల్ మ్రోగింది. వాసుదేవరావు లేచి రూమ్ తలుపు తెరిచాడు. ఎదురుగా అందమైన వ్యక్తి ట్రిమ్ గా బ్రీఫ్ కేసు పుచ్చుకుని ఉన్నాడు.

"నేను వస్తున్నట్టు మీ నాన్నగారు మీకు ఫోన్ చేసి ఉంటారనుకుంటాను. నేను సి. ఐ. డి. బ్రాంచి ఆఫీసర్ని" అని తన్నుతాను పరిచయం చేసుకున్నాడు.

"అవునవును. చెప్పారు! ప్లీజ్ గెట్ ఇన్!" అంటూ అతడ్ని లోపలకు ఆహ్వానించాడు.

సోఫాల్లో ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు. వాసుదేవరావు కొంచెంగా గాభరాపడుతున్నాడు ఇతగాడి రాకకు కారణం ఊహించలేక. ఆ వ్యక్తి అది ఊహించనట్టుగా ఉన్నాడు. వెంటనే అందుకున్నాడు.

"చూడండి! నా రాకగురించి మీరేం సీరియస్ గా ఫీల్ అవొద్దు. మీనుంచి కొంత సమాచారం కావాల్సివచ్చాను. అంతే. టేక్ ఇట్ ఈజీ!"

"థ్యాంక్యూ వెరీమచ్!"

"అన్నట్టు నా పేరు చెప్పలేదు కదూ. నా పేరు అర్జున రావు. అసలు పేరేలెండి. అప్పుడప్పుడు మారుపేర్లతో గూడ వ్యవహరిస్తుంటాం కదా?సరే అసలు సంగతికి వద్దాం" అంటూ ఆగాడు. అతడి కళ్ళు బ్రాందీ సీసామీద పడ్డయ్యి. అతడి కోరికను వాసుదేవరావు పసిగట్టాడు.

బాటిల్ ఓపెన్ చేసి రెండు గ్లాసుల్లోకి బ్రాందీని వంచాడు. ఒక గ్లాసు అతడికి అందించి, మరోటి తను తీసుకున్నాడు.

"ఛీర్స్!" అంటూ తనగ్లాసు వాసుదేవరావ్ గ్లాసుకి తాకించి రెండు గుక్కల్లో త్రాగేశాడు సోడాకూడా కలుపుకోకుండా. ఆ తర్వాత అతడు మళ్ళీ మొదలెట్టాడు.

"మనదేశం ఈమధ్య రష్యాతో అనేక సహాయక ఒప్పందాలను కుదుర్చుకోవటం అమెరికా దేశానికి వ్యతిరేకతను తెచ్చిపెట్టింది. అసలు నిజానికి మనదేశం కష్టకాలంలో ఉన్నప్పుడు అటు బంగ్లాదేశ్‌తో యుద్ధంలోకాని, ఇటు పాకిస్తాన్‌తో యుద్ధం అప్పుడుకాని మనకు అండగా నిలబడింది రష్యాదేశమే. అటువంటి దేశంతో మనం కొంచెం సఖ్యతగా ఉన్నందువల్ల తప్పేంలేదు. ఇది అమెరికావారికి ఇష్టంలేదు. అందువల్ల మనదేశంలో వారి గూఢచారి కలాపాలను ఎక్కువ చేసింది."

వాసుదేవరావు శ్రద్ధగా వినసాగాడు.

"ఒకవారం రోజుల క్రితం అనుమానాస్పదమైన వ్యక్తిని బీచ్‌లో పట్టుకున్నాం. అర్ధరాత్రప్పుడు అతడు బీచ్‌లో తారట్లాడుతున్నాడు. అతడి చేతిలో పాకెట్ సైజుది బహుశా ట్రాన్స్‌మిటర్ అయివుండచ్చు-మేం అతడ్ని పట్టుకునే లోపలే అతడు దాన్ని ముక్కలు ముక్కలుచేసి సముద్రంలో పారేశాడు. అతడ్ని అరెస్టుచేసి తీసుకెళ్ళాం.

అతని జేబుల్లో ఎక్కడా ఏ ఆధారమూ దొరకలేదు. అతన్ని గట్టిగా ప్రశ్నించాం. అంటే చిత్రహింసపెట్టి కాదనుకోండి. జెనీవా ఒప్పందాలకు అనుగుణంగానే అతడ్ని ఇంటరాగేట్ చేశాం. మాకు పూర్తి సమాచారం దొరక్కముందే అతడు చనిపోయాడు."

"కొంపతీసి మీ దెబ్బలకు చచ్చిపోలేదు గదా?"

"కాదు. అతడే ఆత్మహత్య చేసుకున్నాడు?"

"అదెలా సాధ్యం. అతన్ని మీరు పట్టుకున్నప్పుడు అతడి వద్ద ఆత్మహత్య కుపకరించేవి ఏవీ లేకుండా చెయ్యలేదా?"

"ఎందుకు చెయ్యాలా? కాని నేరస్థులు ఎప్పుడు అధికారుల కన్న కొంచెం తెలివి ఉపయోగిస్తుంటారు. అతడి పళ్ళ వరుసలో ఒక దంతం కట్టుడి పన్ను. దాన్ని నాలుకతోనే ప్రక్కకు నెట్టేసరికి అందులోంచి పౌడరు—ఆర్సెనిక్ పౌడరు నోట్లోకి రావటం, అతడి ప్రాణాలు పోవటం జరిగింది."

"ఇంతకీ అతగాడు ఏ గ్యాంగ్‌కి చెందినవాడు. దొంగ బంగారమా. గూఢచారా. లేక దొంగనోట్ల తాలుకా?"

"అదే తేలలేదు. అతడి నోటినుంచి వెలువడిన మాటల్ని టేప్ రికార్డు చేశాం. టేప్‌ని మళ్ళీమళ్ళీ రిపీట్ చెయ్యగా తేలిన సారాంశం ఏమిటంటే అతగాడి పేరు రాము అని, ఏదో గ్యాంగులో చేరటానికి వచ్చాడనీ హోటల్ డీలక్స్‌లో శనివారం సాయంత్రం ఎవరో వ్యక్తివచ్చి అతడిని కలుసుకుని బాస్ దగ్గరకి, అంటే ఆ ముఠా 'హెడ్ దగ్గరకి తీసుకువెడతాడని తెలిసింది."

"అచ్చం డిటెక్టివ్ నవలలోలాగే ఉంది. అయితే ఇందులో నేను చేయగలిగేదేముంది?"

"వస్తున్నాను. ఆ రాము చనిపోయాడు. అయితే ఆ విషయాన్ని సీక్రెట్‌గా ఉంచాం. అతడిని పోలిని వ్యక్తికోసం మేము గత నాలుగురోజుల్నుంచీ గాలిస్తున్నాం. మీ పోలిక

అన్నీ అతడితో సరిపోయినయ్. మీరు రాముగా మారిపోయి ఆ గ్యాంగ్‌లో చేరిపోయి వాళ్ళ రహస్యాల్ని ఆచూకీతీసి మాకు తెలియపర్చాలి.''

వాసుదేవరావు నోరు తడారిపోయింది. గ్లాసులోకి బ్రాండీ వంచుకుని అందులో ఐస్‌గడ్డలు వేసుకుని త్రాగాడు. అర్జున రావుకూడా గ్లాసు ఖాళీచేశాడు.

''ఆఫ్‌కోర్స్. ఇది కొంచెం ప్రమాదంతో కూడుకున్న విషయమే. అయినా మా బ్రాంచి వాళ్ళు మిమ్మల్ని వెయ్యి కళ్ళతో కనిపెడుతూనే ఉంటారు. ప్రమాదం అని తోస్తే వెంటనే సీన్‌లోకి వచ్చి వాళ్ళే కలుగజేసుకుంటారు. దేశం కోసం, న్యాయాన్ని పరిరక్షించేందుకు మీరీ సాహసం చెయ్యాక తప్పదు. దీనికి తగిన బహుమతి ప్రభుత్వం మీకు ఇస్తుందనుకోండి చివరలో. కనుక ఈ విషయంలో మీరు సహాయం చేయాలి!''

''దానికేం! తప్పకుండా చేస్తాను. విత్ ప్లెజర్!''

''మీ కోడ్‌నేమ్ జడ్_6. మీకు అందిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఫోన్ చేసి చెప్పండి ఫోన్ నెం. 2639కి. ఆ నెంబరు, మీ కోడ్‌నేమ్ జాగ్రత్తగా గుర్తుపెట్టుకోండి. ఎటువంటి పరిస్థితుల్లోనూ అవి శత్రువులకి తెలియరాదు.''

''డిటెక్టివ్ నవలలు శతసహస్రాలుగా చదివిన నాకు ఆ మాత్రం తెలియదంటారా? ఓకే! ఐయామ్ రెడీ!''

''హోటల్ డీలక్స్ అంటే తెలుసుగా. కొంచెం చవక బార్ టీ అమ్మే ఇరానీ హోటలు. మీరు యిలా ట్రిమ్ముగా వెళితే పట్టుబడిపోతారు.''

''క్షణాలమీద డ్రెస్ మార్చేయనూ! నేను ఎప్పుడు వెళ్ళాలి?''

''ఈ రాత్రికే వెళ్ళండి. ఒకవేళ మిమ్మల్ని కలవవలసిన వ్యక్తి రాకపోతే మళ్ళీ రేపు వెళ్ళండి. అలా ఒకవారం

క్రమం తప్పకుండా ట్రై చెయ్యండి. ఈ లోపల తప్పకుండా మిమ్మల్ని ఎవరో కలుస్తారని నా నమ్మకం. మీరు చేయవలసిన దంతా గుర్తుందా? మళ్ళీ ఒకసారి చెప్పనా?"

"అవసరంలేదు. మీరు నా కప్పజెప్పిన ఈ బాధ్యతను ఎంత నేర్పుగా నిర్వహిస్తానో మీరే చూస్తారుగా?"

"ఓ.కే విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్!" అంటూ అర్జునరావు లేచి నిలబడి చేయి ముందుకు జాపాడు.

వాసుదేవరావు అతడిలో కరచాలనం చేశాడు. కోటు భుజాన వేసుకుని అర్జునరావు తలుపు తెరుచుకుని బయటకు వెళ్ళిపోయాడు.

వాసుదేవరావు సంతోషానికి అవధులులేవు. షెర్లాక్ హోమ్స్, జేమ్స్ బాండ్, డిటెక్టివ్ వాలి, యుగంధర్, పరశురామ్ అందరూ అతని కళ్ళముందు మెదిలారు. సినిమాలో హీరో ఛాన్సు దొరికిన యాక్టరులా సంబరపడిపోయాడు అతడు. తన అభిమాన నటుడు సీన్ కానరీకి భక్తితో నమస్కరించాడు.

"మిస్టర్! నువ్వు 007 అయితే నేను జడ్ - నిక్సని తెలుసా?" అని జబ్బలు చరుచుకున్నాడు.

5

రోజూ రెండు పూటలా షేవ్ చేసే గడ్డాన్ని కొద్దిగా పెరిగినట్టుగా కనబడడానికి ఆ పూట షేవ్ మానేశాడు వాసుదేవరావు. తన గుడ్డలన్నిటిలోకి మాసినది, అక్కడక్కడా చిఱుగులున్న జతతీసి తొడుక్కున్నాడు. చేతి కున్న ఉంగరాలు, వాచీతీసి డ్రాయర్లో వేశాడు.

ఇకపోతే పాత జోళ్ళు తొడుక్కోవాలి కాళ్ళకు. కాని అతనికున్న జతల్లో పాతవి లేనేలేవు. రాక్ లో పదమూడు జతలు- బూట్లూ, చెప్పులూ, స్లిప్పర్స్ అన్నీ ఉన్నాయ్. కాని సగం పాతబడినవికూడా లేవు. అసలు పట్టుమని పది

రోజులైనా తొడిగితేకదా అవి పాతబడటానికి.

ఏంచెయ్యాలా అని సీలింగ్ వంక చూస్తూ ఆలోచించాడు. వెంటనే అతడికి అయిడియా వచ్చింది. వెంటనే కాలింగ్ బెల్ నొక్కాడు.

తలుపు నెట్టుకుని బోయ్ వచ్చాడు.

అతడి పాదాలవంక చూసాడు జడ్-6. అవి పాతబడిన కాన్వాసు బూట్లు.

"చూడు! నీ బూట్లు ఇక్కడ వదిలేసి ఆ రాక్‌లో నీకు నచ్చిన జత పట్టుకెళ్లు!" అన్నాడు.

వాడికి మతిపోయినంత పనైంది.

"అయ్యగారు పరాచికాలాడుతున్నారల్లేవుంది!" అనిన్నాడు వాడు.

"కాదురా! నిజంగానే. తర్వాత నీ వాచీ అమ్ముతావా అలాంటి దానితో పనిబడింది!"

"అదేమిటండీ! అది చాలా పాతకాలం నాటిది. పైగా ఇప్పుడు సరిగా ఆడటంలేదు గూడా సార్!"

"ఫరవాలేదు. ఇదిగో ఈ వంద తీసుకో. ఆ వాచీ ఇవ్వు. ఆ బూట్లుగూడా విడిచివెళ్ళు!" అన్నాడు సీరియస్‌గా.

సిరి తన్ను వెతుక్కుంటూ వస్తే కాదనలేక రూమ్‌బోయ్ తన బూట్లు అక్కడ వదిలేసి, కొత్తజత ఒకటి వేసుకుని తన వాచీ ఇచ్చేసి, వందరూపాయలు జేబులో కుక్కుకుని, 'అయ్యగారికి మతేమన్నా పోలేదుగదా!" అని ఆశ్చర్య పడుతూ బయటకు వెళ్ళిపోయాడు.

వాసుదేవరావు డ్రాయరు తెరిచి కొన్ని కరెన్సీనోట్లు తీశాడు. పది ఒకరూపాయనోట్లు పైజేబులో పెట్టుకున్నాడు. ఇరవయి రూపాయలనోట్లు కానిని లోపలి జేబులో కుక్కుకున్నాడు. వానకి తడిసి రంగు వెలిసిపోయి చెత్తబుట్టలో పడేసిన ఈవెనింగ్ హాట్ తీసుకుని రూమ్ లాక్ చేసి బయ

టకు వచ్చాడు.

కాఫీ సెక్షన్‌లో అందరూ తనకేసి వింతగా చూడటం అతని కింకా ఉషారు నిచ్చింది. హైక్లాసు హోటల్లో ఈ పాపర్ ఎవడ్రా అన్నట్టుగా వున్నయ్ వాళ్ళ చూపులు. అంటే, తన మేకప్ చాల ఇంప్రెసివ్‌గా వుందన్నమాట అనుకున్నాడు.

రోడ్డుమీద కొంతదూరం నడిచి మలుపు తిరగగానే రిక్షాని కేకేసి, "డీలక్స్‌కి పోనివ్వు" అంటూ అందులోకి ఎక్కి కూర్చున్నాడు.

6

డీలక్స్ హోటల్ ఎదురుగా సినిమాహాలు వుండటంవల్ల రాత్రిపూట రద్దీగా వుంటుంది.

ఒకటే పెద్దహాలు. దాని వెనుక కిచెన్. హోటల్లో కబుర్లు చెప్పుకుంటూ నవ్వులు, సర్వర్ల కేకలతో గోలగా వుంది.

వాసుదేవరావు హాల్లో చుట్టూ కలియజూసి ఒక వారగా ఖాళీగా ఉన్న కుర్చీలో కూలబడి ఆమ్లెట్‌కి ఆర్డరిచ్చాడు.

వసంతవిహార్ లాంటి క్లాస్ హోటల్లో టిఫిన్ అలవాటు పడ్డ తనకు ఇక్కడ ఆమ్లెట్ నోట్లో పెట్టుకోబుద్ధి వెయ్యలేదు. అయినా అయిష్టంగానే తింటూ, తనకోసం ఎవరన్నా వస్తారేమో అని ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూడసాగాడు.

అతడికి ఎదురుగా కూర్చున్నవాళ్ళు టీ త్రాగేసి వెళ్ళిపోయారు. ఆ రెండు కుర్చీలు ఖాళీ అయినయ్.

ఆమ్లెట్ పూర్తిచేసి టీకి ఆర్డరివ్వగానే అతడి కెదురుగా ఎవరో వ్యక్తివచ్చి కూర్చున్నాడు. అతడే తనకోసం వచ్చిన వ్యక్తేమో అని ఆశగా చూశాడు.

కాని, అతడు టీకి ఆర్డరిచ్చి తలవంచుకుని కూర్చున్నాడు

విచారంగా. కరువు కాటకాల్ని గురించో, కలరా ఉధృతాన్ని గురించో లేక ఆటంబాంబు పడబోతున్నట్లుగానో లేక జాక్ ది రిప్పర్‌ని గురించో భయపడుతున్నట్టుగా విచారంగా వున్నాడల్లే వుంది అతగాడు అనుకున్నాడు వాసుదేవరావు. అతడు టీ త్రాగేసి గప్‌చిప్‌గా వెళ్ళిపోయాడు.

వాసుదేవరావు నిట్టూర్చాడు అసహనంగా. ఆ తర్వాత మరో యిద్దరు వ్యక్తులు, మరో ఆడపిల్లవచ్చి కూర్చుని టిఫిన్ చేసి టీ త్రాగి వెళ్ళిపోయారు.

"హల్లో బ్రదర్! కులాసానా?" అని ఎవరో భుజంమీద చెయ్యివేసి పలకరించాడు.

వాసుదేవరావు తేరుకుని పలకరించిన వ్యక్తివైపు చూశాడు. అతనెవరో కొత్తవ్యక్తి. తనెన్నడూ చూసి ఎరగడు. అయినా తను బయటపడకూడదనుకున్నాడు.

"కులాసాయే! సినిమాకా?" అని తిరిగి సమాధానం చెప్పాడు నవ్వుతూ.

అతడు వెళ్ళిపోయాడు. మరోసారి నిట్టూర్చాడు జడ్-6.

ఈ తడవ వయసు మళ్ళిన వ్యక్తి వచ్చి కూర్చున్నాడు అతడి కెదురుగా. మనిషి దవడలు పీక్కుపోయి నీరసంగా వున్నాడు. అతడు వాసుదేవరావు కళ్ళల్లోకి చూశాడు సూటిగా. ఇతడే అయివుండవచ్చనుకుని వాసుదేవరావు "టీ త్రాగుతారా?" అని అడిగాడు.

అతడు కోపంగా చూశాడు. "నేనేం ముష్టివాడ్ననుకున్నావా టీలు అడుక్కోవటానికి!" అంటూ అతడు చివాలునలేచి వెళ్ళిపోయాడు.

'వచ్చిన వెధవనల్లా గూఢచారి అనుకోవటం నాదే బుద్ధి తక్కువ. ఈ తడవ ఎవర్నీ అంత తేలికగా విశ్వసించవలుచుకోలేదు' అనుకున్నాడు వాసుదేవరావు.

వెయిటర్‌ని పిలిచి మరో ప్లేటు బిస్కెట్లు తెప్పించు

కున్నాడు. ముక్కిపోయిన వాసనకొట్టే వండిన పదార్థాల కన్నా అవే నయమనిపించినయ్.

"నిన్నెక్కడో చూసినట్టు గుర్తు. ఏవూరు మనది?" అతని కెదురుగా కూర్చుని అడిగాడు మరో ఆగంతకుడు.

"ఈ ఊరే!" అన్నాడు వాసుదేవరావు నిర్లక్ష్యంగా. "మందేవూరు?"

"మాది కృష్ణరాజపురం. మా స్నేహితుడి తమ్ముడు నీ లాగే వుంటాడు అచ్చంగా. అతనేమో అనుకున్నాను" అంటూ అతడు లేచి వెళ్ళిపోయాడు మరో మూలకు.

సర్వర్ నవ్వుతో వాసుదేవరావు దగ్గరకు వచ్చాడు.

"ఏంటి నవ్వుతున్నావ్!"

"వాడ్ని మీరు భలేగా తప్పించుకున్నారు. లేకపోతే మూడు నెలల్నుంచి రోజూ ఎవడో ఒకడిమీద పడివుంటూం టాడు. ఏనాడూ తన చేతిలోని డబ్బులు ఇవ్వంగా నేను చూడలేదు," అన్నాడు సర్వర్.

"పోనీలే పాపం! వాడికేం కావాలో ఇచ్చి, నాకు బిల్లు యివ్వు!" సానుభూతిగా అన్నాడు వాసుదేవరావు.

"వద్దుసార్! మీకంత డబ్బులు ఎక్కువగావుంటే వాకిట్లో ముష్టిదానికి వెయ్యండి. అంతేకాని, వాడు పట్టుకున్నా డంటే ఒకపట్టాన వదలడు."

"అలాగా!" అని ఊరుకున్నాడు వాసుదేవరావు.

ఇప్పుడు వీడువచ్చి జలగలా పట్టుకుంటే తను వచ్చిన పథకం అంతా పాడైపోవచ్చు అనుకున్నాడు.

అందరి కళ్ళూ ప్రవేశద్వారంవైపు తిరిగినయ్. ఎవరో వన్నెల విసనకర్ర లోపలికి అడుగుపెడుతోంది.

ఈల పెద్దగా ఈలవేశారు ఆమెని చూస్తునే ఒకమూలనుంచి. ఆమె నవ్వింది. హాల్లో మధ్యగా నిలబడి అందరివంకా చూసింది.

"ఏయ్ పిల్లా! ఇలారా! నా ప్రక్కన సీటు ఖాళీవుంది!" అని పిలిచాడు ఒకవ్యక్తి.

"ఎవరో బజారు మనిషి. బుకింగ్ కోసం వచ్చిందల్లె వుంది' అనుకుని రోడ్డుమీద నడిచే జనంవంక చూడ సాగాడు జడ్_6.

"పోరా, చచ్చునాగన్నా!" అంటూ ఎవర్నో తిట్టి ఆమె సరాసరి తన కెదురుగావచ్చి కూర్చుంది. 'చచ్చాంరా!' అనుకున్నాడు జడ్_6, ఉరఫ్ వాసుదేవరావు.

"అలా గుడ్లప్పగించి చూడకపోతే, ఏమన్నా తింటావా అని అడగలేవూ!" అతనివంకే చూస్తూ అడిగింది.

"బోయ్! ఆమెకేం కావాలో ఇవ్వు!" అన్నాడు చేసేదిలేక.

"ఏమియ్యనూ?" సాగదీస్తూ అడిగాడు సర్వర్.

"ఏదోటి పట్రా తినటానికి!" అంది ఆమె.

సర్వర్ వెళ్ళిపోయాడు.

"మా మామ వస్తానన్నాడు. ఇంకా రాలేదు. దొంగ సచ్చినోడు. దేనిలో కులుకుతున్నాడో ఏమో. టైమెంత యింది దసరాబుల్లోడా?"

"నా గడియారం ఆగిపోయింది!"

"పోనీ నువ్వే తిప్పలేకపోయావు!"

ఈమె ఎవరో తన ప్రక్కనచేరి తన ప్రోగ్రాం అంతా పాడుచేసేట్టుందే అనుకున్నాడు.

ఆమెవంక ధైర్యంగా చూశాడు.

పరువంలోనున్న ఆడది. బహుశా, సినిమా చూసి ఒళ్ళు వేడెక్కిన జనాన్ని ఆకట్టుకోవటానికే అయ్యుంటుంది అనుకున్నాడు జడ్_6.

ఎవడో జులాయి వెధవ వచ్చి తన ప్రక్కన కూర్చునే కన్న కాసేపు కాలక్షేపం జరిగే ఈ స్త్రీ వుంటేనే మేలులే

అనుకున్నాడు అంతలోనే.

బోయ్ ఆమ్లెట్ తెచ్చి ఆమెముందుపెట్టి వెళ్ళిపోయాడు.

బహుశా ఇవాళ తను కలుసుకోవాల్సిన వ్యక్తి రాదేమో!

అర్జునరావు చెప్పినదాన్నిబట్టి చూస్తే ఈరోజునుంచి వారంవరకు లేదా ఆ వ్యక్తి తారసపడేవరకూ తనప్రోగ్రాం ఇదే ప్రతిరోజూ. అందుకే గూఢచారి అనేవాడికి సహనం, ఓర్పు ఎంతో అవసరం. సినిమాలో చూపించినంత తేలిక కాదు రియల్ స్పై బాధ్యత. కాని తనలో ఓర్పు నశించి పోతున్నది? ఎలా? ఎలా? అనుకున్నాడు జడ్-6.

ఆలోచనల్లో మునిగి తేలుతున్న జడ్-6 తన ఎదురుగా వున్న స్త్రీ తనకేసి చూస్తూ కన్ను కొట్టడంచూసి బెదిరి పోయాడు.

ఆమె తలవంచుకుని ప్లేట్లో పదార్థాన్ని కెలుకుతూ, "రామూ! నీకన్న గొర్రె నయం! నీదింత మందబుద్ధేం?" అంది.

వాసుదేవరావు, ఉరఫ్ జడ్-6, ఉరఫ్ రాముకి కుర్చీ లోంచి క్రింద పడిపోయేటంత పనయింది.

7

కుర్చీలో తమాయించుకుని మళ్ళీ సర్దుకుని కూర్చున్నాడు రాము. "నీకోసం అయిదింటినుంచి వెయిట్ చేస్తున్నాను" అన్నాడు నెమ్మదిగా తమాయించుకొని.

"నీవు తెల్లషర్టు వేసుకొస్తావని చెప్పారే!" అన్నది అనుమానంగా అతన్ని చూస్తున్న ఆమె.

"నిజమే. కాని లాండ్రీవాడు ఆ చొక్కా చింపుకొచ్చాడు. అందుకని ఈ రంగుషర్టు వేసుకురావాల్సివచ్చింది."

"ఇలాంటి తప్పులు చేశావంటే బాస్ సహించడు. తెలుసా?"

"ఐయామ్‌సారీ! ఈ ఒక్క సారికి ఊరుకుందూ?"

అన్నాడు బ్రతిమాలుతున్న ధోరణిలో.

తను ఎంతో నేర్పుగా, తను వచ్చిన పనికి వాతావర ణానికి సరిపడ్డ డ్రెస్ సెలక్టు చేసుకోగలిగినందుకు అప్పటి దాకా అతడు తన్ను తాను అభినందించుకుంటున్నాడు. కాని ఈమె వచ్చి దాన్ని తారుమారు చేసేసింది.

తను మొదట్లోనే తప్పు చేసినట్టుగా తేలిపోయింది. స్పై అన్నవాడు ఇలాంటి తప్పులు చేస్తే తేలిగ్గా పట్టుపడిపోతాడు కనుక తను ఇంకా అలర్టుగా వుండాలి అనుకున్నాడు.

"నీ సారీల సంగతి తర్వాత. ఇప్పటికే చాల టయి మయింది, ఇప్పుడు గంట ఎంత?" అనడిగింది.

తన వాచీ చూసుకున్నాడు. అది ఆడటం మానేసి చాలా రోజులయినట్టుంది. ప్రక్క టేబుల్ ముందు కూర్చున్న అతని వాచీలోకి చూసి "ఎనిమిదయింది. కరెక్టుగా!" అన్నాడు.

"ఇదో! ఇది అందుకో!" అంటూ రెండురూపాయల నోటుని టేబుల్ క్రిందుగా అందించింది. అది తీసుకుని జేబులో కుక్కుకున్నాడు రాము. పైనుంచి ఒక చిన్న ముఖ మల్ పర్సు అతని చేతికందించింది.

నవ్వుతూ "ఏం చెయ్యాలో తెలుసుగా!" అంది ఆమె.

"ఇప్పుడే వస్తాను" అంటూ అతడు లేచి లావేట్రీలోకి వెళ్ళాడు. తన వెనుకనే తలుపు గొళ్ళెం పెట్టేశాడు.

ఆమె అతి గోప్యంగా ఇచ్చిన రెండు రూపాయల నోటునీ, పర్సునీ మార్చి మార్చి ప్రత్యేకంగా పరీక్షించి చూశాడు. కాని అతడికేమీ అంతుబట్టలేదు.

'ఏం చెయ్యాలో తెలుసుగా!' ఆమె మాటలే అతని చెవుల్లో మ్రోగుతున్నయ్. 'ఏం చెయ్యాలి! ఏం చెయ్యాలి!' అనుకున్నాడు.

కాసేపు ఆలోచించి ఏదో గుర్తుకు వచ్చిన వాడిలా పర్సు

జేబ్ లాగి, రెండువందలపాయల నోటును మడిచి అందులో పెట్టాడు. డోర్ తెరుచుకుని హాల్లోకి నడిచాడు.

టేబుల్ దగ్గరకు వస్తూ పరీక్షగా ఆమెని చూశాడు.

ఈ మె అన్నమాట ఆ ముఠాలోని వ్యక్తి. కాని ఆమెను బజార్లో చూస్తే ఒళ్ళమ్ముకునే బజారు స్త్రీ అనుకుంటారు ఎవరైనా. ఆమె ఇంత గ్రంథసాంగురాలని ఎవరూ ఊహించ లేరు. అసలు నిజమైన గూఢచారులు సామాన్య ప్రజల్లో ఇలాగే కలిసిపోతారు కాబోలు. ఆమె అనుభవంలో పోలిస్తే ఆమె వయసు తక్కువే కావచ్చు. చిన్నప్పట్నుంచి ఇలాంటి రాకెట్ లో మెసిలివుంటుంది.

"నీ దగ్గర రివాల్వరు వుందా?" కుర్చీలో కూర్చుం టూండగానే అడిగింది ఆమె, రహస్యంగా.

"లేదు. రివాల్వరెందుకు?" అమాయకంగా అడిగాడు.

"నువ్వు చెయ్యబోయేపని ఎంత ప్రమాదకరమయిందో తెలిసికూడ ఏ ఆయుధం లేకుండా ఎలా వచ్చావు?" ఆమె మాటలు కర్కశంగా వున్నాయ్.

తన తెలివితక్కువ సమాధానానికి నొచ్చుకున్నాడు రాము. అంతలోనే మళ్ళీ సర్దుకున్నాడు.

"ఓ అదా నీభయం! నా నడుముకు సైకిలు ఛెయిన్ వుంది. రివాల్వర్లూ, పిస్తోళ్ళూ అమ్మమ్మలూ నాయనమ్మలూ వుపయోగించేవి. నాదంతా కోల్డ్ బ్లడెడ్ మర్డర్స్. తెలుసా?" గర్వంగా ఆమె కళ్ళల్లోకి చూశాడు.

"అలా చెప్పు!" అంది ఆమె నవ్వుతూ.

"అసలు నా చేతిలో రివాల్వరు వుంటే పిట్టల్ని కాల్చి నట్టు కాల్చేయ బుద్దేసుంది నాకు. నా చేతిలో ఆఖరుసారిగా చచ్చింది మా ఫామిలీ డాక్టరే తెలుసా?"

"మొత్తానికి అసాధ్యుడివే నన్నమాట... సరే! ఇక అసలు సంగతి కొద్దాం. బాస్ ఆర్డర్స్ ఏమంటే-ఈ రోజు

రాత్రిగాని లేదా రేపుగాని మనిద్దరం అతడ్ని కలుసుకోవా లని. ఆ విధమేదో నీకు తెలుసుగదా?"

"అవునవును! నాకు తెలుసు!" అన్నాడు దర్పంగా.

"అయినా తగిన జాగ్రత్తకోసం మళ్ళీ చెబుతున్నాను. జాగ్రత్తగా విను. సరిగ్గా తొమ్మిది గంటలకు మనకోసం ప్రకాశం పార్కుకి ఒక వ్యక్తి వస్తాడు...వింటున్నావా?"

"వింటున్నాను! చెప్పు!"

"అక్కడికి చేరాలంటే మనకు కనీసం అరగంట పడు తుంది. ఎకాయికి మనం పోవటానికి వీల్లేదు! మనల్ని ఎవరూ ఫాలో కాకుండా జాగ్రత్త పడాలి. అందుకని ఇక్కడ నుంచి నేను ముందుగా వెళ్ళి మూలమలుపులో ఆగుతాను. నువ్వు నా వెనకే రా!"

"అలాగే!"

"ఇద్దరం కలిసి ఒక ఫర్లాంగు నడిచిన తర్వాత స్టేషన్ రోడ్డు వస్తుంది. నేను ఎడమవైపు రోడ్డున వెళ్ళిపోతాను. నీవు కుడి ప్రక్క రోడ్డునే వెళ్ళి స్టేషన్‌లోకి వెళ్ళు. ఏం?"

"ఫాలో అవుతున్నాను. క్యారీ ఆన్!"

"నీవు స్టేషన్లోకి వెళ్ళు ఎంట్రన్స్ గేటునుంచి. ప్లాటు ఫారం మీదకు వెళ్ళేవు సుమా! ఎంక్వయిరీ దాకా వెళ్ళి మళ్ళి ఎగ్జిట్ గేటు బయటకురా! అక్కడ గళ్ళలుంగీ కట్టు కుని నెత్తిన ఈవెనింగ్ హ్యాట్ పెట్టుకుని రిక్షావాడు వుంటాడు. అందులో ఎక్కి 'పోనీయ్' అను. కొంత దూరం వచ్చిన తర్వాత అతడు 'ఎక్కడికి సార్' అని అడుగుతాడు. అప్పుడు మటుకే చెప్పాలి ప్రకాశం పార్కుకు పోనివ్వమని. స్టేషన్లో ఆ పార్కు పేరు మాత్రం ఎత్తగూడదు? తెలిసిందా?"

"రైటో!" అన్నాడు జడ్ 6 హుషారుగా.

8

జడ్ — 6 ప్రకాశం పార్కులోకి అడుగుపెట్టాడు.

పార్కులో గేటు దాటంగానే ఎడమవేపునుంచి మూడో బెంచీమీద వెయిట్ చెయ్యమని చెప్పింది. బెంచీలు లెక్కేసుకుంటూ మూడో బెంచీ దగ్గరకు వెళ్ళాడు.

ఆ బెంచీ మీద ఇద్దరు కూర్చుని వున్నారు.

జడ్ — 6 గతుక్కుమన్నాడు. ఇప్పుడెలా? ఎలాగో ట్రిక్ చేసి వీళ్ళని వదిలించుకోవాలి. ఎలా?

"సినిమాకు పోలేదా? ఇక్కడ కూర్చున్నారేం?" అని వాళ్ళ దగ్గరకు వెళ్ళి అడిగాడు.

"ఎవడ్రా వీడు! డబ్బుల్లేక మనం ఈ పూట సుక్కేసుకోలేదని ఏడుస్తుంటే సినిమా అంటాడు!"

"అదా సంగతి! ఇదిగో డబ్బు! ఈ అయిదు రూపాయలు తీసుకుని వెళ్ళి త్రాగేసి సినిమాలో దూరండి!" అంటూ అయిదు రూపాయిలు ఒకడి చేతిలో పడేశాడు.

వాళ్ళిద్దరూ తెల్లబోయారు.

"నకిలీ నోటేమోరా!" అన్నాడు రెండోవాడు తన కళ్ళనే నమ్మలేనట్టు.

"లేదా మారని నోటన్నా అయ్యుండాలి. కాకపోతే అంత ఇదిగా అయిదు రూపాయలు ఉత్తి పుణ్యానికే ఇస్తాడా?"

జడ్ — 6 నవ్వుతూ వాళ్ళవంకే చూస్తున్నాడు. వాళ్ళిద్దరు ఆ నోటుని తమ తమ చేతుల్లో తీసుకుని చూశారు. అది మంచి నోటే.

ఇంకా ఆలస్యం చేస్తే ఎదురుగా ఉన్న వ్యక్తి తన అభిప్రాయం మార్చుకుని నోటు లాగేసుకుంటాడేమో అన్న భయంతో ఇద్దరూ లేచి "టాంక్యూ బ్రదర్!" అంటూ

వేగంగా బయటికి నడిచి వెళ్లిపోయారు.

"నోటు మంచిదేరా! వీడి బుర్రే చెడిపోయి వుంటుంద. లేకపోతే ఐదురూపాయలు దానం చేస్తాడా?" అనుకుని నవ్వుకున్నారు ఇద్దరూ.

జేబులోంచి హ్యాండ్ కర్చీఫ్ తీసి సిమెంటు బెంచీని దులిపి కూర్చున్నాడు. అంతలోనే తన వెనుక నుంచి ఆమె వచ్చింది.

"ఎంతసేపయింది వచ్చి?" అనడిగాడు.

"ఒక పావు గంటయింది. నీవు రాలేదని ఆ వెనుకే చాటుగా కూర్చున్నాను."

వెన్నెల రాత్రి కొంచెం చలిగా వుంది. బెంచీమీద అతనికి ఆనుకుని కూర్చుంది. ఆమె స్పర్శ అతనిలో వేడిని పుట్టిస్తోంది. అయినా తను లొంగిపోగూడదు. సీక్రెట్ ఏజంటన్నవాడు ఇంతకన్న పరువంలో ఉన్న స్త్రీలు రా రమ్మని ఆహ్వానించినా తను నిబ్బరంగా ఉండగలగాలి. తనూ అంతే గదా!

"ఇంతకీ నీ పేరు చెప్పావు కాదు?"

"నా పేరు! కమల!"

"అసలు పేరేనా?" మళ్లీ అడిగాడు.

"అవన్నీ అడగకూడదు నువ్వు. చెప్పినది విని ఆ ప్రకారంగా నడుచుకోవటమే! లేకపోతే ఈ ఫీల్డులో రాణించలేవు!" అన్నది ఆమె.

"మనం ఏదో ఒకటి మాట్లాడుకోవాలి గదా? లేకపోతే టైమ్ గడిచేదెలా? అందుకు అడిగాను! మరేం అనుకోకు!" అన్నాడు ఆమె చేతిని లాలనగా నిమురుతూ.

ఆమె కళ్లు వింతగా మెరిసినయ్. "ఇంకా ఎంత టైమ్ ఉంది తొమ్మిదికి?" అనడిగింది.

వాచి చూసుకున్నాడు. ఎనిమిది గంటల నలభయి నిము

పాలయింది ఇంకా మనం ఇరవయి నిముషాలు ఆగాలి!" అన్నాడు.

"చాలా టైమ్ వుంది.అలా ఆ పొదల చాటుకు వెళ్దామా కాసేపు!" అంది ఆమె.

ఆశగా ఆమె వేపు చూశాడు. కాని అతని మనసు ఏదో కీడుని శంకించింది. "అదేం వద్దు! మన పని కానీ!"అన్నాడు నిదానంగా.

ఆమె కిలకిల నవ్వింది. "నిజంగానే అనుకున్నావా? నీకు నిగ్రహం ఉందో, లేదో అని టెస్ట్ చేశాను. అంతే!" అన్నది.

ఎంత గండం గడిచింది! తను ఏమాత్రం తొందరపడ్డా తను ఈ 'రింగ్' లోంచి బయటికి త్రోసివేయబడేవాడే! అందుకే ఈ ఫీల్డులో తిరిగే వాళ్ళకు ఓర్పు, నిగ్రహం,జ్ఞాపక శక్తి అవసరం. ప్లే వెల్ యూ ప్లే...రీడ్ వెల్ యూ రీడ్ అని ఊరికే అన్నారా. అందుకే తను వచ్చిన పని మీదనే తన దృష్టిని కేంద్రీకరించాలి.మధ్య మధ్యలో లావ్ ఆటలు ఆడగూడదు అనుకున్నాడు.

"బాస్ గురించి చెప్పరాదూ ఊరికే కూర్చోకపోతే?" అన్నాడు మౌనంగా కూర్చోలేక. ఆమెనుంచి తన ప్రశ్నకు సమాధానం వస్తుందని ఆశించలేదు. అయినా అడిగాడు.

ఆమె మాట్లాడలేదు. ఆమె దృష్టి గేటుదాటి లోపలకి వస్తున్న వ్యక్తిమీద వుంది. అతడు వీళ్లిద్దరివంకా తీక్షణంగా చూస్తూ పార్కులో ఇంకా పైకి వెళ్లిపోయి గార్డెన్ లో కలిసిపోయాడు.

"నీలాంటి అందమైన వ్యక్తి ఈ ఫీల్డ్ లో కెలా వచ్చావ్?" అని అడిగాడు మళ్లీ మౌనాన్ని సహించలేక.

"నీ ప్రశ్న వింటూంటే నేను చదివిన నవలలో విష

యాలు గుర్తుకు వస్తున్నాయ్. ఒక వ్యభిచారిణి వద్దకువచ్చిన ప్రతి పదిమందిలో తొమ్మిది మందన్నా ఈ కూపంలో కొంగుకు వచ్చి పడ్డావ్ ఇంత అందమయిన దానివి? అని అడుగుతారు. ఆమె కూపంలోనే పడిందనుకో. మరి వీళ్లు మాత్రం వచ్చింది ఎక్కడికి? స్వర్గానికా? కాదే! అదే కూపంలోకి కదా!

“ఇంతకీ నేను ఈ ఫీల్డులోకి ఎందుకు వచ్చానని కదూ అడిగింది? ఇదివరలో నేను లైబ్రరియన్‌గా పని చేస్తుండే దాన్ని. ఆ ఉద్యోగానికి జీతం పెద్దగా ఇవ్వరన్న విషయం నీకూ తెలుసనుకుంటాను? ఆడవాళ్ళకు దుస్తులక్రిందా అలంకరణాల క్రిందే చాలా ఖర్చవుతుంది. పైగా అప్పులున్నాయ్. ఇవన్నీ తెముల్చుకోవాలంటే ఎక్స్‌ట్రా డబ్బు అవసరం. అందుకే ఈ ‘వలయం’లోకి వచ్చాను. ఇప్పుడు పుష్కలంగా డబ్బు ఉంటోంది చేతిలో.”

‘బాగానే ఉంది. ఇంతకీ ఆ వలయం గురించి చెప్పి చావవేం?’ అని తిట్టుకున్నాడు లోలోపల జడ్-6.

ఇదేదన్నా విదేశీ గూఢచారి ముఠానా? వాళ్ళు దేనికోసం ప్రయత్నిస్తున్నారు? ఆటంబాంబుల తయారీ గురించా. లేదు. ఎందుకంటే ఆ ఫార్ములా దాదాపు అన్నిదేశాల వారి దగ్గరా ఉంది ఈ రోజుల్లో. లేదా? అంతరిక్షంలో తిరుగాడే స్పుట్నిక్‌ల గురించా. ఆఁ. తెలిసింది. ఖండాంతర రాకెట్లూ, వాటిని మధ్యలోనే ఛేదించగల రాకెట్ల గురించి అయ్యుండచ్చు! అతని ఆలోచనల్ని చీల్చుకుంటూ ఆమె మాటలు వినిపించినయ్.

“ఈ పని చేస్తున్నందుకు నేనెన్నడూ అభిమానపడలేదు. చట్టప్రకారం మనిద్దరం దోషులమే! కాని న్యాయంగా మనం సంపాదించ గలిగిన దానికన్నా పదిరెట్లు ఎక్కువ సంపాదించగలం!”

"అవునవును!"

"టైమ్ తొమ్మిదయిందా? నీ టైమ్ కరెక్ట్‌గా ఉందా? ఇంతకుముందు నీ వాచీ పనిచెయ్యటం లేదంటివి కదా?"

"స్టేషన్లో టైమ్ కరెక్ట్ చేసి కీ ఇచ్చాను. అది మూడు గంటలు పనిచేసి ఆ తర్వాత ఆగిపోతుంది. అంటే పదకొండు గంటలవరకూ సరిగానే పనిచేస్తుంది."

ఇద్దరూ కాసేపు మౌనంగా కూర్చున్నారు.

"ఎంతసేపూ నేనేనా మాట్లాడేది? కాసేపు ఏవన్నా కబుర్లు చెప్పు!" అంది ఆమె.

"ఏం చెప్పమంటావు?"

"నీ వయసెంత?"

"ఇరవై ఆరు!"

"ఇంత చిన్నవయసులో నే హత్యలు చేశావా?"

తనను హంతకుడుగా ఊహించుకుంటున్నదా? అవును. ఈ ఫీల్డులో అందరూ అలాంటివారే కదా! తను బయటపడ కూడదు. ఏదో కథ అల్లి చెప్పాలి, ఆమె ఇంకా వివరా లడిగితే!

జక్_6 బెంచీమీదకు అనుకుని కాళ్లు బారజాపి గర్వంగా నవ్వాడు. తను హంతకుడు. ఇదివరలో కాకపోయినా ఈ గ్యాంగ్‌లో శత్రువుల్ని కొందరికన్నా చంపే అవకాశం రాకపోదు.

"ఇంతకు పూర్వం ఒక మెడికల్ స్టోర్స్‌లో పనిచేస్తుండే వాడ్ని."

"అయితే తాగుడుకూడా అలవాటయి ఉండాలే?"

"ఎందుకులేదు. ఇవాళంటే ఇలా ఉన్నాగాని లేకపోతే ఈపాటికి రెండు బాటిల్స్ ఖాళీచేసి ఉండేవాడ్ని?"

"చేసిన హత్యల్ని మరచిపోవటానికా?"

"అబ్బే అదేంలేదు! ఎవరన్నా ఆ పనికి పురమాయించి

నప్పుడు రెండో కంటికి తెలీకుండా ఆ వ్యక్తిని సఫా చెయ్యటం, గుర్తుపట్టలేకుండాచేసి ఆ శవాన్ని పారెయ్యడం. అంతే ఆ తర్వాత ఆ విషయమే గుర్తుంచుకోను."

"మీ ఇంట్లో కలతలున్నాయా?"

"అవును! మా నాన్న ఎప్పుడూ తాగివచ్చి ఇంట్లో కలభా చేసేవాడు. మా అమ్మను చావగొట్టేవాడు. దాంతో నేను ఆలనాపాలనా లేకుండా పెరిగాను."

లక్షలకు అధికారయిన తండ్రిని కాసేపు తాగుబోతుగా, దరిద్రంతో బాధపడే మురికివాడలోని వ్యక్తిగా ఊహించుకున్నాడు జడ్_6.

"తర్వాత?"

"చిన్న తనంలోనే ఏదో నేరంచేసి బోస్టర్ స్కూలుకు పంపబడ్డాను. అక్కడ ఆరేళ్ళుండి బయటకు వచ్చేసరికి నా తల్లీదండ్రీ అచూకీయే తెలీలేదు. వాళ్ళిద్దరూ విడిపోయి ఎవరి దోవన వాళ్ళు వెళ్ళిపోయారు అని తెలిసింది. నేను ఏకాకినై పోయాను. ఆ తర్వాత కథ నీకు తెలిసిందే."

"తొమ్మిది దాటింది! మనవాడు ఇంకా రాలేదే? కొంపదీసి మనం అతన్నుంచి తప్పిపోలేదు కదా?"

"ఎందుకంత కంగారు! మనకివ్వబడ్డ ఆదేశాల ప్రకారం నడుస్తున్నాం. చెప్పిన టయిమ్‌కి రాకపోతే బాస్ చేతిలో వాడే తన్నులు తింటాడు! మనకేం?"

"అంతేలే! రాకపోతే ఒకరోజు వృధాగా ఖాళీగా గడిపేశామే అని నా విచారం!"

అంతలో ఎవరో వ్యక్తి అటుగా వాళ్ళవైపే రావటం కనిపించింది.

జడ్_6 హృదయం ఎగిరి గంతేసింది. అతడు నేరుగా వాళ్ళ దగ్గరకువచ్చి "భోజనంచేసి రెండు రోజులయింది. చిల్లరుంటే ఇస్తారా?" అని అడిగాడు.

అతడే తను ఎదురుచూస్తున్న వ్యక్తి అనుకున్నాడు. పైగా అతని వేషం హిప్పీ వేషంలాగే ఉంది. కమలవైపు గూడ చూడకుండా లేచి నిలబడి జేబులోంచి మొఖమల్ పర్సు తెరచి అందులోంచి రెండు రూపాయల కాగితాన్ని ఆ ఆగంతకుడి చేతిలో పెట్టేశాడు.

"చపాతీలు!" అన్నాడు రాము. అదే కోడ్ వర్డ్. రెండు రూపాయలు ఆ వచ్చిన హిప్పీవాడి చేతిలోపెట్టి 'చపాతీలు' అని అనమని అంతకుముందే చెప్పివుంది కమల. తను అలాగే చేశాడు.

"చపాతీలా? అవి నాకు అరగవే! సరే. మీరు చెబుతున్నారు గనుక ఒకరూపాయితో భోజనంచేసి, రేపు చపాతీలు తింటాను. భగవంతుడు మీకు మేలు చేయుగాక!" అంటూ ఆ వ్యక్తి మెరుపులా పరుగెత్తుకువెళ్ళి మాయమయ్యాడు.

జడ్_సిక్స్ ఉరఫ్ రాము తెల్లబోయాడు. అయితే తాము ఎదురుచూస్తున్న వ్యక్తి ఇతడు గాదన్నమాట. తను ఎంత పెద్ద పొరబాటు చేశాడు. ఆదుర్దాలో ఆ రెండు రూపాయల నోటుని_ దానిమీద ఏ రహస్య సంకేతాలున్నాయో ఏమో, దాన్ని కాస్త వాడిచేతిలో పెట్టేశాడు. ఇప్పుడేం దారి! అయోమయంగా కమలవైపు చూశాడు.

"నెవర్ మైండ్ మై బోయ్! పొరబాట్లనేవి సహజమే. అందులోను కొత్తలో అయితే మరీను! ఇదే మరొకరయితే నిన్ను నాలుగు తన్నించి వెళ్ళగొట్టేవారు. నేను గనుక ఈ రహస్యాన్ని భద్రంగా దాస్తాను ఎవరికీ చెప్పకుండా" అన్నది ఆమె అతని భుజాన్ని తడుతూ, అనునయంగా.

నిజమే! ధైర్యంగల వ్యక్తి ఎప్పుడన్నా ఓటమిని పొందినపుడు దాన్ని అంగీకరిస్తాడు. తను చదివిన నవలల్లో గూడ అక్కడక్కడ పొరబాట్లు చేసిన ఏజెంట్లు లేకపోలేదు.

వాళ్ళకు మల్లేనే తను గూడ రాబోయే దాన్ని ఎదుర్కోవటానికి సిద్ధమై వుండటమే కర్తవ్యం!

ఆలోచనల్లో అవమానంతో పరాకుగా ఉన్న రాముని వెన్ను చరిచి అన్నది "అదిగో! అతడే! అతడే!"

రాము ఉలిక్కిపడి అటు చూశాడు. పార్కు గేటు లోంచి మరో హిప్పీగాడు అటుగా వస్తున్నాడు.

"మరి...మరి ... ఇప్పుడెలా?" అన్నాడు కంగారుగా జడ్ —6.

"ఫర్వాలేదు. ఏదో ఒక నోటు ఇచ్చెయ్యి" అన్నది కమల.

నిజమే! ఆడదానికున్న పాటి తెలివి తనకు లేకపోయింది.

లేచి నిలబడి జేబులోంచి పదిరూపాయల నోటుతీసి చిన్న పర్సులో కుక్కాడు. తనే ఆ వస్తూన్న వ్యక్తికి ఎదురు వెళ్ళి కలుసుకున్నాడు.

"చపాతీలు!" అన్నాడు.

"చపాతీలు తినాలంటే రెండు రూపాయ లుండాలి!" అన్నాడు ఆ వచ్చిన వ్యక్తి నవ్వుతూ.

రాముకేదో మెరుపులా ఆలోచన తట్టింది. పర్సును అతడి చేతిలో పెట్టాడు. నోటు అయితే వెంటనే గుర్తుపట్టవచ్చు. అందుకని ఆ పర్సు చూస్తే...అందులోగూడ ఏవన్నా రహస్య సంకేతా లుండచ్చు. ఆ పర్సు వల్లనా తనను గుర్తించవచ్చు.

అతడు పర్సుని పరీక్షగా చూశాడు. "పర్సు అదే! సందేహం లేదు! మరి నోటు!" అంటూ జిప్ లాగి దాన్ని తెరిచి అందులోనుంచి పదిరూపాయల కాగితాన్ని బయటకు లాగాడు.

"ఇదేమిటి? ఇదెక్కడ సంపాయించావు? రెండు రూపాయల కాగితం అంటే పది కాగితం ఇచ్చి నన్ను మభ్య పెడ

దాముకొన్నావా? మన దగ్గర ఆ పప్పులేం వుడకవు?" అంటూ పర్సునీ, కాగితాన్నీ మళ్లీ అతని చేతిలో పెట్టేసి గబాగబా వెళ్లిపోయాడు.

షేక్స్పియర్ ముఖం వేసుకుని కమల దగ్గరకు వచ్చాడు రాము.

అతని ముఖంలో ఓటమి, అవమానం, లజ్జ అన్నీ ద్యోతక మవుతున్నయ్. సీక్రెట్ ఏజెంట్‌గా తను తగడు. ఇటువంటి చేతగాని పనులు చేస్తుంటే తను తేలికగా పట్టుబడిపోతాడు. ఈ చిన్నపనికే తను తడబడిపోయి తప్పటడుగు వేస్తే ఇక ముందుముందు ఎన్నో బాధ్యతాయుత మైనవీ, ప్రమాదకరమైనవీ గూడ చెయ్యాల్సి రావచ్చును. అవి ఎలా చెయ్యగలుగుతాడు.

తన వెంటవచ్చిన కమలగూడ మంచిదానిలా వుంది. లేకపోతే ఈ పాటికి తనను నకిలీ మనిషిగా గుర్తుపట్టేసి, లాక్కెళ్లి వాళ్ళ బాస్‌కి అప్పజెప్పారంటే వాడు తనను యముడికి అప్పజెప్పేది ఖాయం!

"అతడు వెళ్ళిపోయాడు! ఇప్పుడిక మనం చేసేది ఏముంది?" అని బిక్క మొగంతో అడిగాడు రాము.

"అంత మాత్రానికే ఇలా అయిపోతావేం! ఇదివరలో ఎన్నడూ గూఢచారి పనులు చెయ్యలేదా? అవున్లే! నువ్వు చేసినవన్నీ హత్యలే అని చెప్పావు కదూ!"

ఆ మాటకు పౌరుషం తెచ్చుకున్నాడు రాము. నిజమే హత్యలు చేయగల గుండె ధైర్యంగల మనిషి ఇలా బెంబేలు పడిపోవట మేమిటి?

"మరేం ఫర్వాలేదు. మళ్ళీ రేపు రాత్రికి మనకు మరో అవకాశం వుంది!"

"అవునా?" అన్నాడు ఆనందంతో జడ్—6.

"చాలా పొద్దుబోయింది. ఇక వెడదామా?" అంది ఆమె

మత్తుగా వళ్ళు విరుచుకుంటూ.

"నీ ఇల్లెక్కడ?"

"నా ఇల్లు చాలా దూరం? పోనీ నీ రూమ్‌లో గడ పుదాం ఈ రాత్రికి మనిద్దరం!" అంది ఆమె.

అతను గాభరా పడ్డాడు. ఏ క్లాస్ హోటల్లో తన రూమ్ గనుక ఆవిడ చూసిందంటే తను ఓ ఉన్నతాధికారి కొడుకనీ, అసలు 'రాము' కాదనీ ఇట్టే పసిగడుతుంది.

కనుక ఏదైనా వేరే లాడ్జికిపోతే సరి! ఆమెను ఈ రాత్రికి టాప్ చేసి ఆ 'బాస్' నిర్వహించే రాచకార్యా లేమిటో కూపీ లాగాలి అనుకున్నాడు.

"దగ్గరలో ఏదైనా లాడ్జి ఉంటే అక్కడ గడిపేద్దాం! నా రూమ్‌లో ఇంకా ఇద్దరు ముగ్గురం కలిసి వుంటాం... నిన్ను అక్కడికి తీసుకువెళ్ళే అవకాశం వుండదు."

"పోనీ! నేను రిక్షాలో మా ఇంటికి వెళ్ళిపోతాలే!" అన్నది కమల అతనివంక ఓరగా చూస్తూ.

"ఒంటరిగా ఎందుకులే! నాతో వుండటానికి భయమా?"

"భయమా? భయం అంటే ఏమిటో మరిచిపోయి ఆరేళ్ళ యింది. ఈ ఫీల్డులో దేనికీ భయపడరాదు."

"అలా అయితే నాతోరా! ప్లీజ్!" ఎలాగైనా రాత్రే ఆమెనుంచి ఆ 'బాస్' గాడి రహస్యాలు లాగాలని అతడి తాపత్రయం.

9

వనితా లాడ్జిలో డబుల్ రూం తీసుకుని ఇద్దరూ టిఫిన్ చేసి రూమ్‌లో జేరారు.

"అబ్బ! నిద్ర వస్తోంది!" అంది కమల ఆవలిస్తూ. చేతులు వెనక్కి విరుస్తూ ఒళ్ళు విరుచుకుంది. ఆమె సిల్కు పైట జారి పోయింది. రాముకి ఉద్రేకం వచ్చింది. అయినా తమా

యించుకున్నాడు.

"ఇంతకీ 'బాస్' గురించి ఏం చెప్పలేదు?" అన్నాడు ఆమె వంక చూస్తూ.

ఆమె సూటిగా అతని వంక చూసింది. "తొందరెందుకు. రేపు రాత్రికి ఎటూ నువ్వే చూస్తావుగా!" అంది నింపాదిగా.

"పోనీ ఇవాళ నువుమటుకు చెప్పకూడదా?"

"చెప్పాలంటావా?"

"అనేగా అడిగేది!"

ఆమె రహస్యం చెప్పేదానిలా అతడి దగ్గరకు వచ్చింది. ఆమె పైట జారిపోయింది మళ్ళీ. ఆ ఎత్తుపల్లాలను అతని హృదయానికేసి అదిమింది.

ఆమె చేతులు అతన్ని బంధించినయ్. జడ్-సిక్స్ ఆమెకు లొంగిపోయి ఆమెకు బందీ అయిపోయాడు. ఇద్దరూ బెడ్ మీదకి వాలిపోయారు.

అరగంట తర్వాత వాసుదేవరావు ఉరఫ్ రాము ఉరఫ్ జడ్-6 కళ్ళు తెరిచి చూశాడు.

రెండో బెడ్ మీద కమల పడుకొనివుంది. జడ్-6 ని చూసి చిన్నగా నవ్వింది.

"ఇదా నువ్వు చేసేపని రహస్యం చెబుతానని?" అని గట్టిగా అడిగాడు.

"ఏం చేశానని?" ఆమె నవ్వుతూ అడిగింది.

"నన్ను సెడ్యూస్ చేసి పారేసింది చాలక ఇంకా ఏం చేశానని అడుగుతున్నావా?"

"అప్పటికి నువ్వేదో స్త్రీ మొహం ఎరగని వాడిలా?" వెటకారంగా అంది.

అరె ఈమె ఎలా కనిపెట్టింది తను స్త్రీలోలుడని. ఈమె ఎవరో అసాధ్యురాలులావుంది అనుకున్నాడు.

"మనం రోజల్లా కష్టపడ్డాంగదా! రేపు రాత్రిదాకా మనకు రెస్టు! ఈ లోపల మన నరాలకు కాస్త రిలాక్సేషన్ కలిగించాను. అంతేగదా! అయినా నీ అమాయకత్వానికి జాలివేస్తోంది."

"అదేం? అలాగంటావు?"

"లేకపోతే ఈ మొహమేనా లోగడ హత్యలు చేసిందీ? మానభంగాలు చేసిన వ్యక్తి. కనీసం చెప్పిన పనిగూడ సరిగా చెయ్యలేని వాడివి?"

అతడి ముఖం వివర్ణమయింది. నిజాన్ని చెప్పేసి తన నిజ స్వరూపం ఆమెకి చెప్పేసి అయినా సరే ఆ 'బాస్' గాడి గురించి తెలుసుకోకుండా ఈమెను వదలకూడదు, అనుకున్నాడు.

"నిజమే కమలా! నేను ఈ ఫీల్డుకి కొత్త. నేను నిజంగా పోకిరీని, జులాయి వెధవను కాను. కాస్తో, కూస్తో తినటానికి కలవాడినే. డిటెక్టివ్ పుస్తకాలు చదివి, నేనుగూడ ఏదైనా ఎడ్వంచర్ చెయ్యాల్సి ఇలా బయలుదేరాను. నా గురించి నిజాన్ని నీకు చెప్పేశాను. ఇప్పటికైనా నీ గురించి చెప్పు."

అంటూ ఆమె ప్రక్కకు వెళ్ళి ఆమె సరసనే కూర్చుంటూ ప్రతిమాలుతున్నట్టుగా అడిగాడు.

ఆమె అతని జుత్తులోనికి వ్రేళ్ళు పోనిస్తూ అంది.

"నీ అమాయకత్వానికి నాకే జాలివేస్తోంది. అందుకని నేనూ నిజం చెప్పేస్తున్నాను. ఈ 'బాస్', ఈ వలయం అంతా బోగస్. పచ్చిఅబద్ధం. మేమంతా ఒక నాటక కంపెనీకి చెందినవాళ్ళం. నా అసలుపేరు సావిత్రి. నాటకాల్లో హీరోయిన్ గా వేస్తుంటాను.

"మా ఆర్గనైజర్ స్నేహితుడు అతడి పేరు రామ్మూర్తి అనుకుంటాను. అతడువచ్చి మాకు డబ్బిచ్చాడు. సరికొత్త

నాటకం సరికొత్త పంథాలో వెయ్యాలన్నాడు. మేం ఒప్పుకున్నాం. మీ దగ్గరకు వచ్చిన అర్జునరావు, అంటే సి. ఐ. డి. వేషంలో వచ్చాడే మీ వద్దకు అతడికిగూడ వేషమే. అతడి అసలు పేరు కాళిదాసు.''

వాసుదేవరావు పిడికిళ్ళు బిగించి పళ్ళు కొరుకుతున్నాడు.

''దేనికోసం ఇదంతా?'' అని అరిచాడు.

''అదేమో మాకు తెలీదు. రామ్మూర్తి చెప్పిన ప్రకారం మేము మా నాటకాన్ని ఆడుతున్నాం. అంతే!''

''రామ్మూర్తి, రామ్మూర్తి. ఆఁ. ఆ వ్యక్తి ఇప్పుడు గుర్తుకు వచ్చాడు. ఆయనెక్కడున్నాడు?''

''ఆయన ఇంకా రెండురోజులు ఈ ఊళ్లోనే ఉంటాడట. నేషనల్ లాడ్జి, ఆరో నెంబర్ రూమ్‌లో వున్నాడట!''

''నేషనల్ లాడ్జి. ఆరో నెంబరు రూమ్!''

''అవును!''

వాసుదేవరావు గభాలున లేచి గుడ్డలు వేసుకున్నాడు.

''ఎక్కడికి?'' ఆమె ఆదుర్దాగా అడిగింది.

''పనిమీద వెడుతున్నాను. నీ ఇన్ఫర్మేషన్‌కి చాలా థాంక్స్. సెలవు!'' అంటూనే గబగబా బయటకు పరుగెత్తాడు.

10

ఆరో నెంబర్ రూమ్‌ముందు నిలబడి వాసుదేవరావ్ తన జేబులోంచి కాగితంపొట్లాన్ని బయటకు తీశాడు.

పిల్లి గడ్డాన్ని తన గడ్డానికి అతికించుకున్నాడు. కోర మీసాల్ని మీసాల మీద వత్తేసుకున్నాడు. నల్లటి గుడ్డదీసి కళ్ళకు గంతలు కట్టుకున్నాడు.

ఆ తర్వాత గబగబ తలుపు తట్టాడు.

రెండుసార్లు తట్టిన తర్వాత తలుపు తెరుచుకుంది.

సుడిగాలిలా తలుపు నెట్టుకుని లోపలకు జొరబడి కాలితో తలుపును నెట్టి మూసేసి చేతిలోని కత్తిని తీసి అతడి గొంతుకు ఆనించాడు.

"అరవకు! అరిచావో! ప్రాణాలు పోతాయ్!" అన్నాడు.

రామ్మూర్తి స్వతహాగా లావుపాటి వాడు. కాని గుండె ధైర్యం లేని వ్యక్తి. తన సర్వీసులో పై ఆఫీసర్లకు కాకాలు పట్టి పైకొచ్చిన వ్యక్తి. ఏనాడూ ఎవరితోనూ గట్టిగా ఘర్షణ కూడ పడి ఎరగని మనిషి. ఈ సంఘటనలో అతడి పై ప్రాణాలు పైనే పోయినయ్.

"బాబ్బాబూ! చంపకు! నీకు పుణ్యముంటుంది! డబ్బు కావాలంటే నా దగ్గరున్నదంతా ఇస్తాను!"

"ఎంత ఉన్నది? నిజం చెప్పు!"

"నా దగ్గర పదిహేను వందలుంది!"

"నాకు రెండు వేలు కావాలి!"

"బాబ్బాబూ! నా దగ్గర అంతే వుంది. అదీ నా స్నేహితుడిది."

"ఏం దొంగతనం చేసి తెచ్చావా నీ స్నేహితుడి దగ్గర?"

"అబ్బే! అదేం కాదు! ఆయన కొడుకు జులాయిగా తిరుగుతుంటే వాడికి బుద్ధి చెప్పేందుకు ఇచ్చాడు!"

"సరే! నీ చావు ఏమన్నా గాని; తే ఆ డబ్బు!"

"నన్ను వదులు! కోటు జేబులో ఉంది ఇస్తాను!"

"ఊఁ... ఆ పప్పులేం ఉడకవ్! నడు మెల్లగా" అంటూ అతని వెనకగా నిలబడి కత్తివున్న చేతిని అతని మెడచుట్టూ వేసి బిగించి ముందుకు నడిపించాడు. కోటు జేబులోంచి పదిహేను వందలూ అందుకుని దాన్ని తన జేబులో కుక్కుకున్నాడు.

"నీ స్నేహితుడి పేరేమిటి?"

"నిరంజనరావు!"

"మంగుల కంపెనీ అతడా?"

"నీకు తెలుసా?"

మాట్లాడకుండా ప్యాంట్ జేబులోంచి చిన్న సీసానుతీసి జేబు గుడ్డపై ఆ ద్రవాన్ని గుమ్మరించాడు. జేబుగుడ్డను అతడి ముక్కుకు అదిమిపట్టాడు. అతడు మత్తుగా వాలిపోయాడు బెడ్ మీద.

"గుడ్ లెసన్! లేకపోతే నాతోనే చెలగాటమా?" అంటూ చిన్న కాగితంమీద "నీ స్నేహితుడు నిరంజనరావుకు చెప్పుకో పో!" అంటూ రాసి అతని ప్రక్కలో పడేశాడు.

కళ్ళగంతలు, గడ్డమూ, మీసమూ పీకేసి అక్కడే పారేశాడు. తలుపు తెరుచుకుని తాపీగా బయటకు నడిచాడు.

* * *

నిరంజనరావు బెడ్ మీదనుంచి లేస్తూనే తల రెండు చేతులతోను పట్టుకుని అబ్బా! నిద్రలేస్తూనే ఈ తలనొప్పి పట్టుకుందే! రేపు ఇన్ కమ్‌టాక్స్ పేపర్లు ఫైల్ చెయ్యాలి. ఆ స్టేట్ మెంట్స్ అవీ దగ్గరుండి చేయించాలి అని విసుక్కుంటూ లేచి కాలకృత్యాలు తీర్చుకొని ఆఫీసుకు బయలుదేరాడు.

దోవలో ఒకరిద్దరు ఆఫీసర్లని కలిసి, వ్యాపారవిషయాలు సేల్స్‌టాక్స్ వ్యవహారాలు మాట్లాడి ఆఫీసుకు వెళ్ళాడు.

అప్పటికే ఆఫీసంతా హడావిడిగావుంది. ఎవరో తరుముతున్నట్టుగా కొందరు అటూ ఇటూ తిరుగుతూ తొందరపడుతుంటే, మరికొందరు చకచకా తమ పని చేసుకుపోతున్నారు.

ఏమిటీ హడావిడి! కొంపదీసి ఇన్ కమ్‌టాక్స్ వాళ్లుగాని దాడి చెయ్యలేదు గదా? అని గాభరాగా లోపలకు వెళ్ళాడు!

తన ఆఫీస్ రూమ్ తలుపు తీసేసరికి లోపల దృశ్యం చూసి తనకళ్ళను తనే నమ్మలేకపోయాడు.

ఎదురుగా తనకొడుకు వాసుదేవరావు, బి. కాం; ఎన్ని సార్లు మందలించినా ఆఫీసు వ్యవహారాల్లో తల దూర్చటానికి ఎదురుతిరిగిన కొడుకు, ఈ రోజున తనకంటె ముందరేవచ్చి ఆఫీసులో కూర్చుని ఆఫీసు రన్ చేస్తున్నాడు. అకస్మాత్తుగా వీడికిలాంటి మంచి బుద్ధి ఎలా కలిగిందబ్బా అని విస్తుపోయాడు.

తన స్నేహితుడు రామ్మూర్తి అమలు జరిపిన పథకం తాలూకు ఫలితమేమో అనుకుంటే అదికాదు. ఇందాకనే రామ్మూర్తి త్రోవలో కారాపి తన పథకం అడ్డం తిరిగిందనీ, వాసుదేవరావు తనాడించిన నాటకం మధ్యలోనే అంతర్ధానమైనాడనీ, ఎవరో రౌడీ తనదగ్గర డబ్బు కాజేసిన వైనం మొరపెట్టుకుని లబోదిబోమన్నాడు. అతడ్ని తనే ఓదార్చి కొంత డబ్బిచ్చి పంపాడు.

“గుడ్ మార్నింగ్! డాడీ! వెల్‌కమ్!” అన్నాడు వాసుదేవరావు.

అతని చుట్టూ ఎకౌంటెంట్, హెడ్‌క్లర్కు, స్టెనో చుట్టూ మూగివున్నారు. అందరికీ అన్ని వైపులా అతడే ఎంతో అనుభవజ్ఞుడిలా ఆదేశాలిస్తున్నాడు.

“సూర్యుడు పడమట ఉదయించడం లేదు గదా?” అన్నాడు కొడుకుని చూసి నవ్వుతూ.

వాసుదేవరావు అంతలోనే సీరియస్ అయిపోయాడు. “అడ్డమైనవాళ్ళకీ వేలకివేలు తగలేస్తుంటే చూస్తూ ఊరుకో బుద్ధి కాలేదు. అందుకే బిజినెస్ నేనే హాండోవర్ చేసుకుందామని వచ్చేశాను,” అన్నాడు.

“ఏదీ? మళ్ళీ ఇంకోసారి అను ఆ మాట?”

“ఒకసారికాదు. వెయిసార్లంటాను. అయినా నేనన్న దాంట్లో తప్పేముంది?”

నిరంజనరావు పకపక నవ్వాడు. “నీవు ఈ మాత్రం

ప్రయోజకుడివవాలనే వేలకువేలు తగలేశాను. తప్పా?"

"తప్పో, ఒప్పో నాకు తెలీదు. ఇకనుంచి అలా జరగ టానికి వీల్లేదు."

"ఒప్పుకున్నా నబ్బా. సరెండర్డ్! సరేనా! ఒరేయ్! ఏ తండ్రైనా కొడుకుముందు చిన్నతనం ఫీల్ కాడు. ఎందుకంటే తన కొడుకు గొప్పవాడు కావాలని ప్రతి తండ్రీ వాంఛి స్తాడు."

"దెన్. విష్ మి సక్సెస్ డాడీ!"

"ఓకే! సెక్రటరీ! వెంటనే కూల్ డ్రింక్స్ తెప్పించు. మా ఇద్దరికే కాదు. మన ఆఫీసంతటికీ తెప్పించు. అది సరేరా? మరి నీ డిటెక్టివ్ లన్నీ ఏంచేస్తావ్?"

"ఓ అవా? తీరిక సమయాలలోనో, కార్లో దూర ప్రయాణం చేసేటప్పుడో కాలక్షేపం కోసం చదవనూ!"

"గుడ్! ఇప్పుడు నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ శుభవార్త మీ అమ్మకుకూడా చెప్పనీ" అంటూ రిసీవర్ అందుకున్నాడు నిరంజనరావ్.

—: ఐపోయింది :—